ఇచ్చాడు. దాన్ని అర్థం చేసుకున్నాక ఇక ధనం కోసం పరమాత్మ మీద తప్ప ఈ లోకంలో ఇతరుల మీద ఆధార పడటం అవివేకం అనిపించి రాలేదు."

రాజు నవ్వి చెప్పాడు.

"సంతోషం. నేను మీకు గీతని దేనికైతే ఇచ్చానో అది ఫలించింది. నాలా భగవంతుడ్ని నమ్ముకున్నవాడు ఎన్నడూ మోసపోడు."

ఆ రాజు ఆ బ్రాహ్మణుడికి, అతని కూతురు వివాహానికి అవసరమైన ధనాన్ని ఇచ్చి పంపించాడు.

## 44. ఇప్పటికీ ఢిల్లీ దూరంగానే ఉంది

ఢిల్లీలోని నిజాముద్దీన్ అనే రైల్వే స్టేషన్ పేరు చాలామంది విని ఉంటారు, చూసి ఉంటారు కూడా. కాని ఆ నిజాముద్దీన్ గురించి అందరికీ పూర్తిగా తెలిసి ఉండకపోవచ్చు.

సూఫీ మహాత్ముడు నిజాముద్దీన్ ఔలియా ఢిల్లీలోని నేటి నిజాముద్దీన్ స్టేషన్ ప్రాంతంలో కొన్ని వందల ఏళ్ళ క్రితం జీవించి ఉన్న సమయంలో, నేటి లాగే అమాయక ప్రజల నించి దోచుకునే అధికార యంత్రాంగం తుగ్లక్ ప్రభుత్వంలో పనిచేస్తుండేది. మహాత్ముడైన ఆ నిజాముద్దీన్‌ని దర్శించుకోడానికి అనేక మంది భక్తులు వచ్చేవారు. కాని ఆయన ఆ అధికార యంత్రాంగంలోని ఎవరినీ తన దగ్గరకి రానిచ్చేవాడు కాదు. గయాజుద్దీన్ తుగ్లక్ దర్బారులో పనిచేసే అమీర్ ఖుస్రూ అనే ఒక్కర్ని మాత్రం ఔలియా తన దగ్గరకి రానిచ్చేవాడు. ఎందుకంటే ఖుస్రూ నిజాయితీ, పవిత్రత కలిగిన వాడు.

తుగ్లక్ ఖుస్రూ ద్వారా నిజాముద్దీన్ గొప్పతనాన్ని గురించి విని, ఆయన్ని దర్శించాలని సంబర పడ్డాడు. రాజ సాంప్రదాయ ప్రకారం, తను ఫలానా రోజున ఫలానా సమయానికి రాబోతున్నానని వార్తాహరుడ్ని ముందుగా పంపాడు. నిజాముద్దీన్ ఆ వార్తాహరుడితో నిక్కచ్చిగా 'తుగ్లక్‌కి ప్రవేశం లేదు' అని చెప్పాడు. రెండు, మూడు సార్లు తుగ్లక్ వార్తాహరుడ్ని పంపడం, తుగ్లక్ తనని చూడటానికి నిజాముద్దీన్ తిరస్కరించడం జరిగాయి.

"మీరు నా ఇంట్లోకి ఓ వాకిలి లోంచి వస్తూంటే, నేను ఇంకో వాకిలి లోంచి బయటకి వెళ్ళిపోతాను.' అనే సందేశాన్నే ప్రతీ వార్తాహరుడికి చెప్పి పంపేవాడు.

ఓ రోజు తుగ్లక్ ఖుస్రూని పిలిచి కొద్దిగా కోపంగా చెప్పాడు.

"నేను దౌలతాబాద్‌కి వెళ్తున్నాను. వస్తూ మీ ఔలియాని సందర్శిస్తానని, ఒకవేళ ఆయన నన్ను చూడటానికి తిరస్కరిస్తే ఆయన నివాసాన్ని కూల్చివేస్తానని చెప్పి ఏం జవాబు చెప్తాడో వచ్చి నాకు చెప్పు."

"నేను ఎప్పుడూ చెప్పే జవాబే చెప్పానని వెళ్ళి చెప్పు." నవ్వుతూ జవాబిచ్చాడు నిజాముద్దీన్ ఖుస్రూ ఈ విషయం చెప్పగానే.

ఖుస్రూ ఆయన్ని రాజీకి తెచ్చే ప్రయత్నం చేసాడు కాని అది ఫలించలేదు. ఖుస్రూ తుగ్లక్‌కి అదే జవాబుని చెప్పి పంపాడు. ఆ కబురు అందగానే తుగ్లక్ దౌలతాబాద్ నించి ఖుస్రూకి కబురు చేసాడు, తను ఫలానా రోజున ఢిల్లీకి వస్తున్నానని ఔలియాకి చెప్పమని, అతని ఇంటిని ఆ రోజు తను పడగొట్టబోతున్నానని. ఖుస్రూ నిజాముద్దీన్‌కి అది చెప్పి బ్రతిమాలాడు.

"ఒక్కసారి ప్రభువుకి కొన్ని నిముషాల దర్శనం ఇవ్వండి చాలు."

"ఊహూ. అతని అధికారులు చేసే పాపలు అతనికి అంటుకున్నాయి. నేనతన్ని చూస్తే అవి నాకు అంటుకుంటాయి. కాబట్టి అతని మొహం నేను చూడను."

మళ్ళీ తుగ్లక్ నించి ఖుస్రూకి కబురు వచ్చింది, తను వారం రోజుల్లో వస్తున్నాని, నిజాముద్దీన్‌ని తయారుగా ఉండమని. ఖుస్రూ ఈ విషయం ఔలియాకి చెప్పగానే అతను శాంతంగా జవాబు చెప్పాడు.

"అతనికి ఢిల్లీ చాలా దూరంగా ఉంది."

మూడు రోజుల్లో తను తిరిగి వస్తున్నానని తుగ్లక్ మళ్ళీ కబురు పంపాడు. ఖుస్రూ అది చెప్పగానే నిజాముద్దీన్ నవ్వి చెప్పాడు.

"అతనికి ఢిల్లీ చాలా దూరంగా ఉంది."

ఒక్క రోజులో తను వస్తున్నానని మళ్ళీ తుగ్లక్ కబురు చేసాడు. ఖుస్రూ ఏడుస్తూ వచ్చి నిజాముద్దీన్‌తో చెప్పాడు.

"ఆ దుర్మార్గుడు రేపు వచ్చేస్తున్నాడు. రాజీకి రావడం గురించి ఏమైనా ఆలోచించారా?"

"అతనికి ఢిల్లీ చాలా దూరంగా ఉంది." శాంతంగా జవాబు చెప్పాడు.

"షెహన్షా ఢిల్లీ పొలిమేరలకి వచ్చారు. ఇంక కొన్ని గంటల్లో మీ నివాసం కూలడం మీరు స్వయంగా చూడచ్చని షెహన్షా మీకు తెలియచేయమన్నారు." తుగ్లక్ మర్నాడు పంపిన ఇంకో వార్తాహరుడు సరాసరి నిజాముద్దీన్ దగ్గరకి వచ్చి చెప్పాడు.

"అతనికి ఢిల్లీ ఇప్పటికీ చాలా దూరంగా ఉంది." అతనికి శాంతంగా జవాబు చెప్పాడు ఔలియా.

మర్నాడు ఉదయం షెహన్షా తుగ్లక్‌కి స్వాగతం పలకడానికి ఏర్పాటు చేసిన బరువైన ద్వారం దగ్గరకి నిజాముద్దీన్ మీద రగిలే పగతో చేరుకున్నాడు గయాజుద్దీన్ తుగ్లక్. అకస్మాత్తుగా ఆ ద్వారం కూలిన దుర్ఘటనలో తుగ్లక్ మరణించాడు. నిజాముద్దీన్ మాటల్లో సత్యం ఉంది. అతనికి ఇప్పటికీ ఢిల్లీ దూరంగానే ఉంది.

ఎప్పుడైనా మీరు ఢిల్లీ వెళితే నిజాముద్దీన్ స్టేషన్‌లో దిగి, దగ్గరే ఉన్న నిజాముద్దీన్ సమాధిని దర్శించి అక్కడ కాసేపు ప్రార్ధన చేసుకోండి. కనీసం రైల్లో నించైనా. లేదా మీరు ఢిల్లీలో వున్నా, మీకు ఢిల్లీ చాలా దూరంలో ఉన్నట్లే.

## 45. ధర్మం తర్వాతే ఏదైనా

రామ రావణ యుద్ధం జరుగుతోంది. ఇంద్రజిత్, కుంభకర్ణులు, వారి కుమారులు కూడా యుద్ధంలో మరణించారు. ఇంతలో వారంతటి శూరుడైన ఓ రాక్షసుడు లంకలోంచి యుద్ధానికి వచ్చి వానరులని వూచ కోత కోయసాగాడు. ఇది గమనించిన విభీషణుడు వెంటనే తన గదని తీసుకుని ఆ రాక్షసుడి మీదకి యుద్ధానికి వెళ్ళాడు. ఇద్దరి మధ్యా భీకర యుద్ధం జరిగింది. ఇద్దరి శరీరాలు